క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

క్రోసూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరుగుతుందని ఎంపీడీవో జి.శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఎంపీపీ పి.కోటయ్య అధ్యక్షతన జరిగే సమావేశంలో వ్యవసాయ, పశు పోషణ, వైద్య, ఆరోగ్యం, వెలుగు, విద్య, శిశు సంక్షేమం, ఎన్ఆర్జీఎస్, ఎక్సైజ్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరుగుతుందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి ఆధార్ కేంద్రాలు ప్రారంభం

క్రోసూరు: మండలంలోని క్రోసూరు, ఊటుకూరు, దొడ్లేరు గ్రామాల్లోని సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయటం జరిగిందని, శుక్రవారం నుంచి ఆధార్ నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని ఎంపీడీవో జి.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ అప్‌డేట్, పేర్లు, అడ్రస్‌లు, పుట్టిన తేదీ నమోదు, బ్యాంకుకు ఆధార్ లింకేజి తదితర సవరణలు చేయించుకోదలచిన వారు చేయించుకోవచ్చన్నారు. వారం రోజుల పాటు ఆధార్ కేంద్రాలు పనిచేస్తాయన్నారు.

యాదవజాతి అభివృద్ధికి కృషి జరగాలి

అమరావతి: యాదవుల అభివృద్ధికి రాజకీయాలకతీతంగా కృషి జరగాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, జిల్లా యాదవ సంఘ ప్రతినిధి కోవూరి సుధాకర్ యాదవ్ ఒక ప్రకటనలో అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని లేమల్లెలో మాట్లాడుతూ నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన యాదవ కార్పొరేషన్ చైర్మన్, బోర్డు మెంబర్లు పార్టీలకతీతంగా యాదవుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. యువత ఉపాధి కోసం రుణాలను, విద్యార్థుల విదేశీ విద్య అవకాశాలను మరింత పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పశు సంపదను కాపాడటానికి నూతన పథకాలతో అభివృద్ధి చేయాలన్నారు. గొర్రెలు, మేకలను యూనిట్లుగా పేద యాదవ కుటుంబాలకు పంపిణీ చేయాలన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రాలలో యాదవ అన్నదాన సత్రం నిర్మాణం చేపట్టాలని సూచించారు.

విద్యార్థిని అభినందించిన ఎంఈవోలు



క్రోసూరు: జవహర్ నవోదయ విద్యాలయం నిర్వహించిన పరీక్షలో 6వ తరగతి ప్రవేశానికి సీటు సాధించిన దొడ్లేరు శ్రీ చైతన్య పబ్లిక్ స్కూల్ విద్యార్థి ఆవుల శివ ధనుష్‌రెడ్డిని ఎంఈవోలు ఏకుల ప్రసాదరావు, ఎం.గణేష్ అభినందించారు. క్రోసూరు విద్యావనరుల కేంద్రంలో విద్యార్థి, పాఠశాల డైరెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి ఎంఈవోలను కలిసారు. ఈ సందర్భంగా విద్యార్థి శివ ధనుష్‌కు ఎంఈవోలు బహుమతి అందచేసి ప్రోత్సహించారు. ఇంకా బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని వారు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంబాబు, సారథి పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రంగారావు



సత్తెనపల్లి: ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన గణపవరపు రంగారావు నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ ఆదేశాల మేరకు ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్‌కే మనోహర్‌రావు నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని రంగారావుకు పలువురు బ్రాహ్మణ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు.

రెండవ విడత రీ సర్వే ప్రక్రియ ప్రారంభం



కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని కుందురువారిపాలెం గ్రామంలో రెండవ విడత రీ సర్వే ప్రక్రియను తహసీల్దార్ ఎం.భవానిశంకర్ గురువారం ప్రారంభించారు. అనంతరం రైతులు, సర్వే సిబ్బందితో స్థానిక కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. సర్వే జరిగే ప్రాంతంలో ఉన్న రైతులందరికీ ముందస్తు సమాచారం అందించాలన్నారు. రైతుల సమక్షంలోనే సర్వే పూర్తి చేయాలన్నారు. రైతులు కూడా భూములకు సంబంధించిన రికార్డులను సర్వే సిబ్బందికి అందించి సహకరించాలన్నారు. ప్రతి రోజు సర్వే పూర్తయిన వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, గ్రామ సర్వేయర్ వెంకటప్పారెడ్డి, మండల సర్వేయర్ టి.సుధాకర్, వీఆర్వో దాసు తదితరులు పాల్గొన్నారు.

తొలి పంట.. మలి పంటకు బలం

- అవశేషాలను కలియదున్నడం ద్వారా భూమి సారవంతం
- పొలంలో పంట వ్యర్థాలను కాల్చివేయడంతో భూమికి నష్టం
- వేసవి దుక్కులతో అధిక ప్రయోజనం



పత్తి కట్టెను పొలంలో కాల్చేస్తున్న రైతులు

బెల్లంకొండ: వ్యవసాయంలో రైతులు సస్యరక్షణ చర్యలు పాటించినప్పుడే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చు. విచక్షణా రహితంగా పురుగు మందులు వాడడం ద్వారా రైతులు నష్టాల బాట పడుతున్నారు. సహజ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించడంతో పాటు భూమిని సారవంతంగా చేసుకోవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వేసవి దుక్కులు దున్నించడం, పంటల అవశేషాలు తగలబెట్టకుండా భూమిలో కలియదున్నడం, భూసార పరీక్షలను చేయించడం వంటివి చేయాలని చెబుతున్నారు.

అపోహలు విడనాడాలి

పంటల కోత అనంతరం అవశేషాలను అధిక శాతం మంది రైతులు పొలాల్లోనే తగలబెడుతున్నారు. దీంతో నేల సారాన్ని కోల్పోవడమే కాకుండా పర్యావరణానికి తీరని ముప్పు చేకూరుస్తుంది. వాటిని కాల్చకుండా పొలంలో కలియదున్నితే భూమికి అదనపు బలాన్ని ఇస్తుంది. అధిక దిగుబడులు సాధించవచ్చు. అలాగే తెగుళ్ల బెడద కూడా తగ్గుతుంది.

- ఒకప్పుడు పంటల అవశేషాలను కలియదున్నడం ద్వారా ఎరువుగా మార్చుకుని సేంద్రియ వ్యవసాయ విధానం ద్వారా మంచి దిగుబడులు సాధించిన రైతులు ప్రస్తుతం అందుకు భిన్నంగా వాటిని దహనం చేస్తుండడంతో పలు విధాలుగా నష్టపోతున్నారు.
- తెగుళ్లు అధికంగా ఆశించడం, వాటి నివారణకు రసాయన ఎరువులు విస్తారంగా వినియోగించడం వల్ల భూమి సహజ గుణాన్ని కోల్పోతోంది. పంటల అవశేషాలను భూమిలో కలియదున్నితే ఆ దుష్ప్రభావం తదుపరి పంటలపై ఉంటుందనేది రైతుల భావన. తద్వారా వాటిని తగలబడితే తెగుళ్లకు కారణమయ్యే బ్యాక్టీరియా నశిస్తుందనే అపోహలో ఉన్నారు.
- మరికొందరు రైతులు త్వరితగతిన మరో పంట వేసుకునేందుకు వీలుగా అవశేషాలను తగలబెడుతున్నారు. అయితే దీనివల్ల లాభం లేకపోగా నష్టం అధికంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు.
- గతంలో పంట కలం పూర్తి అయిన తర్వాత రైతులు వాటి అవశేషాలను భూమిలో మగ్గబెట్టి, సాగు చేసే సమయంలో కలియదున్నేవారు. అలా చేయడం ద్వారా సేంద్రీకరణం పెరిగి పంటలకు మేలు చేకూరుతుంది. పత్తి, మిర్చి, మొక్కజొన్న, వరి పంటలను భూమిలో కలియదున్నితే పోషకాలు అందుబాటులో ఉంటాయి. సేంద్రియ ఎరువుగా మారి మరో పంట దిగుబడి అధికంగా రావడానికి ఉపయోగపడుతుంది. వరి పంటను కింద వరకు కోసి గడ్డిగా ఉపయోగించుకోవచ్చు.

భూమి నిస్సారం అవుతుంది



పంటల అవశేషాలను కాల్చడం ద్వారా పర్యావరణానికి నష్టం కలుగుతుంది. భూమిలో పోషకాలు, కర్బన పదార్థాలు తగ్గడం, పంటకు మేలు చేసే ఎరలు, సూక్ష్మక్రిములు నశిస్తాయి. రైతులు అవశేషాలను తప్పనిసరిగా దుక్కిలో కలిపి దున్నడం ద్వారా ప్రయోజనం ఉంటుంది. నేలలో సేంద్రీయ కర్బనం పెరిగి పంటలకు మేలు జరుగుతుంది. దిగుబడులు పెరగడంతో పాటు తెగుళ్ల బెడద కొంతమేర తగ్గుతుంది.

– డి.కృష్ణయ్య, ఏవో, బెల్లంకొండ

- అలా కాకుండా అవశేషాలను దహనం చేయడం ద్వారా పర్యావరణానికి నష్టం కలగడమే కాకుండా, పంటలకు మేలు చేసే ఎరలు, ఇతర సూక్ష్మక్రిములు పూర్తిగా నశిస్తాయి. తద్వారా భూమి నిస్సారమవుతుంది. ఫలితంగా ఎంత పెట్టుబడులు పెట్టినా ప్రయోజనం ఉండదని వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

బీఎల్వోలకు శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఉమాదేవి



హాజరైన బీఎల్వోలు

పెదకూరపాడు: నియోజకవర్గంలోని బీఎల్వోలకు పెదకూరపాడులోని షాదీ ఖానాలో నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి, మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్ట్ అధికారి ఉమాదేవి ఆధ్వర్యంలో గురువారం ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ నమోదు విధివిధానాలపై, బీఎల్వోలు రికార్డులు మెయింటెనెన్స్, ఫామ్–6, 7 నమోదు, ఓటర్ల చేర్పులు, మార్పులు, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్లు తొలగింపుపై శిక్షణ ఇచ్చారు. పెదకూరపాడు, అమరావతి, బెల్లంకొండ, క్రోసూరు, అచ్చంపేట తహసీల్దార్‌లు ధనలక్ష్మి, మీసాల డేనియల్, బేగం, వెంకట నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వేసవిలో దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



మజ్జిగ పంపిణీ చేస్తున్న కమిషనర్ ఆనంద్‌కుమార్

సత్తెనపల్లి: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని తాలూకా సెంటర్‌లో పురపాలక సంఘం ఆధ్వర్యంలో, కోర్టు ఆవరణ, ట్యాక్సీ స్టాండ్ సెంటర్‌లో కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, అమరావతి బస్టాప్ సెంటర్‌లో డీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించి, మాట్లాడుతూ చలివేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని, ఎప్పటికప్పుడు మంచినీటిని నింపి ప్రజలకు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. తొలి రోజు చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్ చేతుల మీదుగా చేపట్టారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, డీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వరరావు, 7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ కుమార్, నాయకులు కోమటినేని శ్రీనివాసరావు, ఎ.నాగేశ్వరరావు, బలిజేపల్లి సురేష్, అనుమోలు జయరామ్, పూజల వెంకట కోటయ్య తదితరులు ఉన్నారు.

భూముల రీ సర్వేతో రైతులకు మేలు

తహసీల్దార్ అష్రఫున్నీసా బేగం



మాట్లాడుతున్న తహసీల్దార్ అష్రఫున్నీసా బేగం

బెల్లంకొండ: భూముల రీ సర్వే కార్యక్రమంతో రైతులకు మేలు జరుగుతుందని తహసీల్దార్ అష్రఫున్నీసా బేగం తెలిపారు. గురువారం మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో రీ సర్వే గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టు ద్వారా వెంకటాయపాలెంలో రీ సర్వే కార్యక్రమాన్ని గత కొద్ది రోజుల నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏళ్ల తరబడి పరిష్కారం కాకుండా ఉన్న భూ సమస్యలను రీ సర్వే ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు. అత్యాధునిక టెక్నాలజీతో భూమి హద్దులను నిర్ణయిస్తున్నట్లు తెలిపారు. మండల కేంద్రానికి దూరంగా ఉన్న వెంకటాయపాలెం గ్రామంలో విజయవంతంగా రీ సర్వే పూర్తి చేసి మిగిలిన గ్రామాలకు ఆదర్శంగా ఉండేలా సర్వేయర్లు పనిచేయాలని తహసీల్దార్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జానీ బాషా, మండల సర్వేయర్ వీరయ్య, గ్రామ సర్పంచ్ భూక్య నాగమ్మ బాయి, వీఆర్వో మస్తాన్ వలి, సర్వేయర్లు వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ మేళం శ్రీరామ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం



లక్ష్మీనరసింహస్వామి



ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో భక్తులు

బెల్లంకొండ: మండలంలోని పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామమైన కేతవరం గ్రామంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం ధ్వజస్తంభ, పరివార దేవతల విగ్రహ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి వేద పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కొండ దిగువనగల ఆలయం వద్ద ధ్వజస్తంభాన్ని వేద మంత్రోచ్ఛారణల నడుమ ప్రతిష్ఠించారు. ఈ ప్రతిష్టా కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై, పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన వితరణ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. ప్రతిష్టా కార్యక్రమంలో గుంటూరు మిర్చియార్డ్ మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, రిటైర్డ్ తహసీల్దార్ పి.భాస్కరరావు, దేవదాయ శాఖ ఈవో అవుడూరి వెంకటేశ్వరరెడ్డి, ఆలయ కమిటీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పాశం నరసింహారెడ్డి, ఈమని వెంకటరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

నేడు మిర్చి రైతుల ధర్నా

నకరికల్లు: మిర్చి పంటకు మద్దతు ధర కోసం ఈ నెల 4న ఉదయం 10 గంటలకు గుంటూరు మిర్చియార్డు వద్ద చేపట్టబోయే ధర్నాలో రైతులందరూ పాల్గొనాలని కౌలు రైతు సంఘం మండల అధ్యక్షుడు జి.పిచ్చారావు గురువారం పిలుపునిచ్చారు. మిర్చి పంట వేసిన రైతులందరూ ప్రస్తుతం నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన రూ.11,781 సరిపోదన్నారు. మిర్చి క్వింటాకు రూ.5 వేలు బోనస్‌గా ఇవ్వాలని, నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా పంటను కొనుగోలు చేయాలని, కనీస మద్దతు ధర రూ.15 వేలకు పెంచాలని పలు డిమాండ్లతో గుంటూరు మిర్చియార్డు వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులందరూ ఉదయం మిర్చియార్డు వద్దకు చేరుకొని రైతుల వాణిని బలంగా వినిపించాలని కోరారు.

ఉపాధి హామీ పథకం ఏపీవోగా వెంకటేశ్వర్లు

బెల్లంకొండ: ఉపాధి హామీ పథకం ఏపీవోగా గురువారం వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించారు. మాచవరం మండలంలో పనిచేస్తున్న ఆయన బదిలీపై బెల్లంకొండ మండలానికి వచ్చారు. ఇప్పటివరకు బెల్లంకొండలో ఏపీవోగా విధులు నిర్వహించిన కోటమ్మ బదిలీపై పెదకూరపాడు మండలానికి వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏపీవో వెంకటేశ్వర్లు ఎంపీడీవో హనుమారెడ్డిని కలిశారు. మండలంలోని అన్ని గ్రామాలలో ప్రతి ఒక్కరికి వంద రోజులు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

రుణమేళాకు 284 మంది హాజరు



నకరికల్లు: రుణమేళాలో ఎంపికైన లబ్ధిదారులు ఆర్థికంగా ఎదగాలని డీఎల్‌పీవో రాజగోపాలరావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ కార్పొరేషన్‌ల రుణ మేళా గురువారం నిర్వహించారు. మొత్తం 482 మంది దరఖాస్తు చేసుకోగా 284 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, కాపు, వైశ్య, బ్రాహ్మణ, కమ్మ, రెడ్డి, మేదర, శాలివాహన, ఈబీసీ కార్పొరేషన్‌లకు సంబంధించి స్వయం ఉపాధి పథకాల ద్వారా రుణాలు మంజూరు చేస్తారని అన్నారు. రుణ అర్హత పొందిన వారు సకాలంలో రుణాలు చెల్లించి ఆర్థిక పురోగతికి బాటలు వేసుకోవాలని సూచించారు. రుణమేళాకు ఎంపీడీఓ జి.కాశయ్య, ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నకరికల్లు శాఖ, జీడీసీసీ బ్యాంకు గుండ్లపల్లి, రూపెనగుంట్ల, కుంకలగుంట శాఖలు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కండ్లకుంట శాఖ మేనేజర్‌లు హాజరయ్యారు.

ఘనంగా కావడి ఉత్సవం



పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో వేంచేసియున్న నాగుల గుడి దేవస్థానంలో వసంత నవరాత్రుల మహోత్సవంలో భాగంగా గురవారం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి పల్లకి ఉత్సవం, కావడి ఉత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. షష్ఠిని పురస్కరించుకొని సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణతో భక్తుల దర్శనార్థం ఉంచారు. కావడి ఉత్సవం పట్టణంలోని జానపాడు రోడ్డులో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం నుంచి నాగుల గుడి దేవస్థానం వరకు ఉత్సాహంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ అర్చకులు వెంకటేశ్వర శర్మ తీర్థప్రసాదాలను అందజేశారు.

పారా లీగల్ వలంటీర్లు బాధ్యతతో పని చేయాలి

సత్తెనపల్లి సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) విజయకుమార్ రెడ్డి



మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయ్‌కుమార్ రెడ్డి

సత్తెనపల్లి: పారా లీగల్ వలంటీర్లు బాధ్యతతో పని చేయాలని సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సత్తెనపల్లి సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) వి.విజయ్‌కుమార్ రెడ్డి అన్నారు. సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి న్యాయస్థాన ప్రాంగణంలో గురువారం నూతనంగా నియమింపబడిన పారా లీగల్ వలంటీర్ల (పీఎల్‌వీ) శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఎంతో బాధ్యతాయుతమైన విధులు కలిగినది పారా లీగల్ వలంటీర్ వ్యవస్థ అన్నారు. ప్రజల ముంగిట న్యాయం అనే నినాదంతో బాధ్యతతో పని చేయాలని, అనేక చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఒక సంవత్సరం పాటు పదవీ కాలం ఉంటుందని సూచించారు. శిక్షణలో భాగంగా అరెస్టు, రిమాండ్, బెయిల్, బీఎస్ఎస్ చట్టంపై న్యాయమూర్తి విజయ్‌కుమార్ రెడ్డి అవగాహన కల్పించారు. శిక్షణ తరగతుల్లో ముందుగా ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు లీగల్ సర్వీసెస్ అథారిటీస్ చట్టం–1987పై అవగాహన కల్పించారు. ప్యానల్ న్యాయవాది గంటా వెంకట శివ గృహహింస చట్టం, భరణంపై అవగాహన కల్పించారు. ప్యానల్ న్యాయవాది బీఎల్ కోటేశ్వరరావు సివిల్ వివాదాలు, సివిల్ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులకు భూసార పరీక్షలు అవసరం

ఏవో అహ్మద్

అమరావతి: మండలంలోని రైతులంతా భూసార పరీక్షలు చేయించి అధిక దిగుబడులు పొందవచ్చునని మండల వ్యవసాయాధికారి అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు మట్టి నమూనాలు సేకరించేటప్పుడు పొలంలోని నాలుగు మూలల మట్టిని సేకరించి అన్నింటిని కలిపి ఒకే రకం నమూనాగా పరీక్షలకు పంపాలన్నారు. భూసార పరీక్షలు చేయటం వల్ల భూమిలోని నత్రజని, సల్ఫర్, పొటాషియం ఏఏ మోతాదులో ఉన్నాయో తెలుసుకోవచ్చన్నారు. దీని ద్వారా భూమికి ఏఏ రసాయనాలు అవసరమవుతాయో వాటినే వాడటం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. వేసవి కాలంలో రైతులందరూ ఉచితంగా నిర్వహించే భూసార పరీక్షలను చేయించుకోవాలని ఆయన సూచించారు. రైతులు మట్టి నమూనాలను రైతు సేవా కేంద్రాలలో సిబ్బందికి అప్పగించాలని తెలిపారు. మట్టి నమూనాలు ఇచ్చిన రైతులకు నెలలో నివేదికలను అంజేస్తామన్నారు.

కృష్ణారెడ్డి మృతి బాధాకరం

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి



కృష్ణారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ గజ్జల

సత్తెనపల్లి: వైఎస్సార్‌సీపీ నాయకుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి అన్నారు. సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామానికి చెందిన దుగ్గెంపూడి కృష్ణారెడ్డి ఇటీవల మృతి చెందడంతో గురువారం దశ దిన కార్యక్రమంలో పాల్గొని కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, రైతు సలహా మండలి రాష్ట్ర మాజీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దొంతు వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

రాజన్న చలివేంద్రం ప్రారంభించిన డాక్టర్ గజ్జల

రాజుపాలెం: మండలంలోని ఇనిమెట్ల గ్రామంలో వైఎస్సార్‌సీపీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజన్న చలివేంద్రంను వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి నాయకులతో కలసి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తేలుకుట్ల చంద్రమౌళి, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ మర్రి సుబ్బారెడ్డి, ఎంపీటీసీ సైదా, మాజీ సర్పంచ్ మాలాలి, దేవరంపాడు సర్పంచ్ ప్రత్తిపాటి దీనమ్మ, మాజీ ఎంపీపీ వేల్పుల వెంకటేశ్వర్లు, నాయకులు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ రోబోటిక్ చేతులకు రిజిస్ట్రేషన్

పిడుగురాళ్ల: దివ్యాంగులకు ఉచిత రోబోటిక్ కృత్రిమ చేతుల పంపిణీ కార్యక్రమం మే 11న చేపట్టనున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ ప్రోగ్రాం కన్వీనర్ కోటా రమేష్ గురవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు మోచేతి కింద కనీసం నాలుగు అంగుళాల చెయ్యి కలిగిన దివ్యాంగులు ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఈ రోబోటిక్ కృత్రిమ చేతుల పంపిణీ చేస్తామన్నారు. ముందస్తు రిజిస్ట్రేషన్ల కోసం 98853 46845, 98484 20549 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

సత్తెనపల్లిలో ఛత్రపతి శివాజీ వర్ధంతి



మహారాష్ట్ర వీధిలో ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద మాట్లాడుతున్న కొత్తా రామకృష్ణ

సత్తెనపల్లి: హిందూతత్వాన్ని పెంపొందించే విధంగా ఛత్రపతి శివాజీ తన జీవితాన్ని అర్పించారని ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ మాజీ సభ్యుడు కొత్త రామకృష్ణ అన్నారు. పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ లాంటి గొప్ప వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలు జరుపుకోవడం హిందువుల బాధ్యత అన్నారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు అన్నం బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శివాజీ విగ్రహాన్ని ప్రతిష్టించి మహారాష్ట్ర వీధి వారు ఎంతో గొప్ప పని చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమానికి హాజరైన రామకృష్ణ, బాల సుబ్రహ్మణ్యంలకు మహారాష్ట్ర వీధి ఆంజనేయస్వామి గుడి అధ్యక్షుడు పులహరి ఫిరోజీ కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పులహరి బానోజీ, నాయకులు చెక్క రవికుమార్, దేవరశెట్టి రఘు, కిషోర్, ఫిరోజి, శివాజీ, అశోక్, పవన్, వెంకటేశ్వర్లు, ప్రసాద్, నర్సోజి, గోవిందరావు తదితరులు ఉన్నారు.

చిన్నారులు బాల్యం నుంచే మానసిక వికాసం కలిగి ఉంటారు



సెయింటాన్స్‌లో యూకేజీ గ్రాడ్యుయేషన్ డేలో ఎంఈవోలు ప్రసాదరావు, గణేష్, హెచ్ఎం

క్రోసూరు: చిన్నారులు బాల్యం నుంచే మానసిక వికాసాన్ని కలిగి ఉంటారని, దానిని వెలికితీయటం, తీర్చిదిద్దటం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల వంతని మండల విద్యాశాఖ అధికారులు ఏకుల ప్రసాదరావు, ఎం.గణేష్‌లు అన్నారు. స్థానిక సెయింటాన్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో యూకేజీ బాలబాలికల గ్రాడ్యుయేషన్ డే ప్రోగ్రాం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏకుల ప్రసాదరావు, ఎం. గణేష్‌లు హాజరయ్యారు. పాఠశాల హెచ్ఎం సిస్టర్ రజిత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ అతి తక్కువ ఫీజులతో, అందరికీ అందుబాటులో విద్యనందిస్తున్న సెయింటాన్స్ పాఠశాల యాజమాన్యానికి, హెచ్ఎంకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. ప్రధానోపాధ్యాయులు సిస్టర్ మేరీ రజిత మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.